క్లుప్తంగా

సత్యదేవుని దర్శించిన పుదుచ్చేరి మంత్రి



సత్యదేవుని సన్నిధిలో పుదుచ్చేరి రాష్ట్ర మంత్రి లక్ష్మీనారాయణన్, మల్లాడి కృష్ణారావు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని సత్యదేవుని ఆలయాన్ని పుదుచ్చేరి రాష్ట్ర టూరిజం, పబ్లిక్‌వర్క్స్, ఫిషరీస్ శాఖల మంత్రి కే లక్ష్మీనారాయణన్, ఆ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు శుక్రవారం సత్యదేవుడిని దర్శించి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ వీర్ల సుబ్బారావు అందజేశారు.

తాగునీటికి ఇబ్బందులు

తొండంగి: పాత కోదాడలో ఓ వీధిలో పైపులైన్ దెబ్బతినడంతో వారం రోజులుగా తాగునీటి సరఫరా అందక గ్రామప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత కోదాడలో ఓ వీధిలో పంట కాలువను తవ్వడంతో వాటర్ ట్యాంకు నుంచి సరఫరా అయ్యే పైపు లైన్ దెబ్బతింది. స్థానికంగా వీధిలో పది కుటుంబాల ప్రజలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. పది రోజులుగా తమకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందని ఉన్నతాధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ముద్రగడ ఆరోగ్యం మెరుగుపడాలని పూజలు

ప్రత్తిపాడు రూరల్: వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ఆరోగ్యం మెరుగుపడాని కోరుతూ ఆ పార్టీ శ్రేణులు శుక్రవారం బవురువాకంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు రామిశెట్టి నాని బుర్ర కృష్ణ, శౌట్టి కోదండం, కంచికోట లక్ష్మీ, జనమూరి లోవరాజు, నాని, అప్పారావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

బోట్‌క్లబ్: న్యూఢిల్లీకి చెందిన సీతానాగజ్యోతి, అభినయ నాగజ్యోతి, వారి శిష్య బృందం ఆధ్వర్యంలో సాగిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఫౌండేషన్ ఫర్ డెవలప్ ఇండియా వారి ఆధ్వర్యంలో కూచిపూడి మార్గం పేరుతో స్థానిక సూర్యకళా మందిరంలో శుక్రవారం రాత్రి ఈ నృత్య ప్రదర్శన నిర్వహించారు. మా తెలుగు తల్లికి మల్లెపూ దండతో ప్రారంభమైన వీరి నృత్య ప్రదర్శన వందేమాతరంతో ముగిసింది. పూర్వ రంగం , గణేశ స్తుతి, జతి స్వరం, దశావతార శబ్దం, బృందావన నిలయమే కీర్తన, తులసీదాసు రచించిన శ్రీరామచంద్ర వంటి కీర్తనలకు కళాకారులు చేసిన నృత్యం ఆద్యంతం జనరంజకంగా సాగింది. తొలుత నాట్యాచార్య కృష్ణకుమార్, ప్రముఖ గాయని పెద్దాడ సూర్యకుమారి, లక్కరాజు సత్యానారాయణన్, తుర్లపాటి మాణిక్యాంబ, ఆనెం ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతానాగజ్యోతి మాట్లాడుతూ, తనతో పాటు, తన శిష్యులు దేశవిదేశాల్లో వందలాది ప్రదర్శనలు ఇచ్చినట్టు చెప్పారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

బోట్‌క్లబ్: ప్రతిభావంతులైన విద్యార్థులకు విడోస్ హోమ్ వ్యవస్థాపక చైర్మన్ పైండా రామకృష్ణారావు శుక్రవారం ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా స్థానిక సాలిపేట మున్సిపల్ గరల్స్ హైస్కూల్ విద్యార్థులకు ఈ మేరకు స్కాలర్‌షిప్‌లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్రం సీనియర్ అసిస్టెంట్ బచ్చు నాగబాబు, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు

పెద్దాపురం: భక్తులు కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించారు.

నిబంధనలు బేఖాతర్

పిఠాపురం: తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు తప్ప ఏఇతర నాయకులకు పాఠశాలల్లో ప్రవేశం లేదు అంటూ డైరెక్టర్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ విజయరామరాజు ఈనెల 1న విడుదల చేసిన సర్క్యులర్‌ను పిఠాపురంలో కూటమి నేతలు తుంగలో తొక్కారు. నిబంధనలకు విరుద్ధంగా కూటమి నేతలు పాఠశాలల్లో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొని ఈ సర్క్యులర్ మాకు వర్తించదు అని నిరూపించారు. పిఠాపురం ప్రభుత్వ పాఠశాలలు వసతి గృహాల్లో జనసేన ఇన్‌చార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ తన అనుచరగణంతో హాజరై జాతీయ జెండాలు ఎగురవేసారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో వివిధ పాఠశాలల్లో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో స్థానిక కూటమి నేతలు పాల్గొనడం విమర్శలకు దారితీసింది. పిఠాపురం విద్యాశాఖాధికారుల తీరును ప్రజలు విమర్శిస్తున్నారు.



గోకవరంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు



శంఖవరం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పర్వత రాజుబాబు



తుని మండల పరిషత్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము



కిర్లంపూడిలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ తోట రవి

ఊరూవాడా.. మువ్వన్నెల జెండా

- ఘనంగా జాతీయ పతాకాల ఆవిష్కరణ
- వైభవంగా స్వాతంత్య్ర వేడుకలు

స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుని తుని, జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో శుక్రవారం వాడవాడలా త్రివర్ణపతాకం రెపరెపలాడింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీలు, సచివాలయాల వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, ప్రజాసంఘాలు, వివిధ మత సంఘాల నాయకులు స్వాతంత్య్ర వేడుకలు జరుపుకున్నారు. పంద్రాగస్టు సందర్భంగా పల్లెలు, పట్టణాల్లో పండగ వాతావరణం నెలకొంది.



ఏలేశ్వరంలో భారీ జాతీయజెండాను ఊరేగిస్తున్న విద్యార్థులు

గోకవరం పాత బస్టాండ్ సమీపంలో..

గోకవరం: స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా గోకవరం మండలంలో శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ సమీపంలో వైఎస్సార్ విగ్రహం వద్ద వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, పార్టీ నాయకులు సుంకర వీరబాబు, సుంకర వెంకటరమణ, కర్రి సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, తన కార్యాలయంలో తహసీల్దార్ సాగర్, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై పవన్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

కోటనందూరు మండలంలో.

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కేఈ చిన్నయ్యపాలెంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి లాలం బాబ్జి, తన కార్యాలయంలో తహసీల్దార్ సత్యనారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గొర్లి రామచంద్రరావు, వాణిజ్య విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ వెలగా వెంకటకృష్ణాజీ పాల్గొన్నారు.

శంఖవరం మండలంలో..

శంఖవరం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పర్వత రాజుబాబు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీడీఓ లక్ష్మీరెడ్డి, ఎంఈఓ ఎస్‌వీ రమణ,ఎంపీటీసీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రౌతులపూడి మండల పరిషత్ కార్యాలయంలో

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకులు ఎంపీడీఓ జి.రాజ్యలక్ష్మి త్రివర్ణ పతాకాన్ని ఎగరవేసి గౌరవ వందనం చేశారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు నరేష్, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వెంకటేశ్వరరావు, సీహెచ్‌సీలో వైద్యాధికారిణి డాక్టర్ సునీత ఆధ్వర్యంలో స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించారు. రౌతులపూడిలో ఓం ఫౌండేషన్ అధినేత సుర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు 365 అడుగుల భారీ జాతీయ పతాకం పలువురిని ఆకట్టుకుంది.

సమరయోధుల పోరాటాలు స్ఫూర్తిదాయకం

తుని రూరల్: సమరయోధుల పోరాటాలు దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. తేటగుంట క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుతో కలసి ఎమ్మెల్యే జాతీయ జెండా ఎగరవేసి సమరయోధులకు నివాళులర్పించారు. దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము జెండా వందనం చేశారు. లోవ దేవస్థానంలో డిప్యూటీ కమిషనర్ పెన్మెత్స విశ్వనాథరాజు, రూరల్ సర్కిల్ కార్యాలయంలో సీఐ చెన్నకేశవరావు, రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ ప్రదీప్ జాతయ జెండాలను ఆవిష్కరించారు. ఎంపీడీఓ కె.సాయినవీన్, ఎంఈఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాల్లో..

కిర్లంపూడి: స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట రవి గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీస్ స్టేషన్‌లో ఎస్సై జి.సతీష్, తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో జె.చిరంజీవి జాతీయ జెండాను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పెనగంటి రాజేష్, ఎంపీడీఓ హెచ్ హరికృష్ణ, ఎంఈఓలు టి.జోసఫ్, ఎం.చిన్నారావు స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొన్నారు.

అట్టహాసంగా వేడుకలు

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వాతంత్య్ర వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీపీ చలగళ్ల దొరబాబు ముఖ్య అతిథులుగా పాల్గొని జెండా ఎగురవేశారు. పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గండేపల్లి సర్పంచ్ రుత్తల లలిత పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయం , మండల పరిషత్ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆవిష్కరించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంపీడీఓ సూర్యనారాయణ పాల్గొన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు జాతీయజెండాను ఆవిష్కరించారు.

జగ్గంపేటలో ..

జగ్గంపేట: స్వాతంత్య్ర వేడుకుల జగ్గంపేటలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు జాతీయ జెండా ఎగురవేసారు.స్థానిక వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో నేతలు పార్టీ శ్రేణులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, సీనియర్ నాయకుడు తులా రాము జెండా ఎగురవేసారు.ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు పాలిపిరెడ్డి సత్తిబాబు, కాపారపు ప్రసాద్, వరుపుల సూరిబాబు, గుర్రం మహాలక్ష్మి, భూమాడ గణపతి పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో..

ప్రత్తిపాడు: భారతీయ కిసాన్ సంఘ (బీకేఎస్) ఆధ్వర్యంలో మండలంలోని పెదశంకర్లపూడి గ్రామ వ్యవసాయ క్షేత్రంలో గురువారం స్వాతంత్ర దినోత్సవ వేడుక జరిగింది. బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



ఏలేశ్వరంలో జాతీయజెండా ఆవిష్కరణలో ప్రముఖులు



జగ్గంపేటలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో జాతీయ జెండా ఆవిష్కరణ



రౌతులపూడిలో భారీ జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

ప్రత్తిపాడు మండలంలో..

ప్రత్తిపాడు : నియోజకవర్గ కేంద్రమైన ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్యఅతిథిగా పాల్గొని, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, ఎంఈఓలు, నాయకులు పాల్గొన్నారు. స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద న్యాయమూర్తి ఎల్ గోపీనాథ్, ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద ఎక్సైజ్ సీఐ పి శివప్రసాద్, తన కార్యాలయం వద్ద రిజిస్ట్రార్ వి విక్టర్ డానియేల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

పాఠశాలల్లో వేడుకలు

తొండంగి: పెరుమాళ్లపురం, బెండపూడి, తొండంగి, రావికంపాడు, కొమ్మనాపల్లి, అద్దరిపేట, దానవాయిపేట,పైడికొండ, ఏ.కొత్తపల్లి, పి.ఇ.చిన్నాయపాలెం, ఏ.వి.నగరం తదితర గ్రామాల్లో పాఠశాలల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎస్.ఎంసీ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



రత్నగిరిపై జాతీయపతాకానికి వందనం సమర్పిస్తున్న దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు

సత్యదేవుని సన్నిధిలో..

అన్నవరం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీరవేంకటసత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో స్వాతంత్రదినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు జాతీయపతాకాన్ని ఎగురవేసి వందన సమర్పణ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

తుని మున్సిపల్ కార్యాలయంలో..

తుని: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువన సుందరితో కలసి శుక్రవారం మువ్వెన్నల పతాకాన్ని ఆవిష్కరించారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఉత్తమ సేవలకు పురస్కారాలు



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఏలేశ్వరం వీఆర్వో అవసరాల కిషోర్



మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న గోకవరం ఎంపీడీఓ గోవిందు



జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్



డిప్యూటీ ఎంపీడీఓ ఐఎన్ శ్రీనివాస్



తహసీల్దార్ జె.చిరంజీవి



డిప్యూటీ తహసీల్దార్ పుణ్యవతి



సీనియర్ అసిస్టెంటు డీవీ సాయివర్మ



ఐసీడీఎస్ కోఆర్డినేటర్ ఐవీ సత్యనారాయణ



లీడింగ్ ఫైర్‌మెన్ సూర్యనారాయణ



లక్ష్మీనారాయణ, వేంకటరమణ

ఏలేశ్వరం/ జగ్గంపేట/ కిర్లంపూడి/గండేపల్లి/ప్రత్తిపాడు/గోకవరం/అన్నవరం : స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం కాకినాడలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ బిందుమాధవ్ సమక్షం సమక్షంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేతులమీదుగా, రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా పలువురు ఉద్యోగులు, వైద్యులు ఉత్తమ సేవలకు అవార్డులు, ప్రశాంసాపత్రాలు అందుకున్నారు. అవార్డు గ్రహీతలను పలువురు అభినందించారు. మండల వీఆర్వో అవసరాల తిరుమలరావు(కిషోర్) ఉత్తమ వీఆర్వోగా అవార్డు అందుకున్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



టి.తిమ్మాపురంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

తుని రూరల్: శ్రావణమాసం శుక్రవారం పర్వదినం కావడంతో టి.తిమ్మాపురం మహావిష్ణువు ఆలయంలో మహిళలు భక్తిశ్రద్ధలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. ఎస్.అన్నవరం శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వరలక్ష్మీదేవికి మహిళలకు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


కిర్లంపూడి: జగపతిపగరం అభయ దుర్గమ్మ, కిర్లంపూడి ఊరు శివారున వేంచేసి ఉన్న వనదుర్గమ్మ ఆలయాల్లోని అమ్మవార్లకు మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వరలక్ష్మీదేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కనకదుర్గమ్మ భక్తులకు వరలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారిని వెండి, బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కనకదుర్గ ఆలయంలో కుంకుమార్చన

రౌతులపూడి: శ్రావణ మాసం సందర్భంగా రౌతులపూడి సినిమా సెంటర్లోని కనకదుర్గ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అష్టలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిస్తున్న గోకవరం దేవీచౌక్ కనకదుర్గమ్మ

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

ఏలేశ్వరం: శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని పలు గ్రామాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, తోటవీధి, నర్సీపట్నం రోడ్డు తదితర ప్రాంతాల్లోని దుర్గాదేవి ఆలయాల వద్ద మహిళలు పూజలు చేశారు.

గర్భిణికి అందని ప్రభుత్వ వైద్యం

ప్రత్తిపాడు రూరల్: మండల కేంద్రమై ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెటర్‌లో డెలివరీ నిమిత్తం వచ్చిన గర్భిణికి వైద్యం అందకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ధర్మవరం గ్రామానికి చెందిన రాపా ఆశకు నెలలు నిండడంతో ప్రసవం నిమిత్తం రాచపల్లి పీహెచ్‌సీ కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఆమెను తరలించారు. సీహెచ్‌సీలో వైద్య పరీక్షల్లో తల్లికి జ్వరంతోపాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయని ఉదయం నుంచి సాయంత్రం వరకూ వైద్య సేవలు అందించి అబ్జర్వేషన్‌లో ఉంచారు. అప్పటికీ జ్వరం తగ్గకపోవడంతో వైద్యులు కాకినాడ ప్రభుత్వం ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆ సమయంలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో ఆందోళన చెందిన ఆశ తండ్రి రాపా నీలబాబు దగ్గరలో ఉన్న ప్రైవేటు ఆస్పత్రిలో ఆమెను చేర్పించారు. అక్కడి వైద్యులు సిజేరియన్ చేసి తల్లీబిడ్డను కాపాడారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆరోగ్యం విషమించిన తన కుమార్తెను కాపాడుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోయినా ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించాల్సి వచ్చిందని బాధితురాలి తండ్రి వాపోయారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

దేశ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకేలో వీసీ సీఎస్‌ఆర్‌కే ప్రసాద్ పాల్గొని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, చదువులపై దృష్టిపెట్టాలని వారికి సూచించారు. కార్యక్రమంలో రెక్టార్ వీవీ సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు , కో–ఆర్డినేటర్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే వీఎస్ లక్ష్మీ మహిళ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.సంధ్య స్వాత్రంత్య సమరయోధుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మజ, ఎన్ఎస్ఎస్ పీవోలు కృష్ణ,హారిక పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరా



పండూరు నీటి పథకం నుంచి సరఫరా అవుతున్న కలుషిత నీరు

కాకినాడ రూరల్: రంగు మారిన కుళాయి నీటిని సరఫరా చేయడంతో తాగలేక ఇబ్బందులు పడుతున్నామని తిమ్మాపురంలోని మారుతినగర్ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండూరు సీపీడబ్ల్యూఎస్ నుంచి తాగు నీటిని ఫిల్టర్ చేయకుండా చాలా రోజులుగా పంపింగ్ చేయడంతో కుళాయిలు ద్వారా నీరు రంగు మారి వస్తోందని, వీటిని తాగు నీటి అవసరాలకు వినియోగిస్తున్నామన్నారు. దీనిపై గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణను వివరణ కోరగా వేసవి నుంచి పండూరు వాటర్ స్కీమ్ నుంచి తిమ్మాపురంలో ఎరుపు రంగులో నీరు వస్తోందని, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు ఆలయాల ముస్తాబు

బోట్‌క్లబ్: నగరంలో శ్రీ కృష్ణుని ఆలయాలు కృష్ణాష్టమి వేడుకలకు ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆయా కమిటీలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలతో పాటు ఆలయ పరిసరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. స్థానిక గోకులంలో శుక్రవారం స్వామి వారికి విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అష్టాదశ కలశ ఆరాధన, నవగ్రహ ఆరాధన, సహస్ర తులసీదళ అర్చన చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు విశేష సహస్రనామార్చన, సాయంత్రం4 గంటలకు ఇస్కాన్ అధ్యక్షుడు అనంత శేషదాసు జన్మాష్టమి వైభవం ప్రవచనం జరుగుతుందని గోకులం అధ్యక్షులు నారాయణం మురళి తెలిపారు. అనంతరం సూర్య నృత్య నికేతన్ ఎం.భరతలక్ష్మి బృందం నృత్య ప్రదర్శన జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం గోపూజ, పల్లకి సేవ, ఉదయం 10 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత కృష్ణస్వామి శాంతి కల్యాణం, శ్రీపుష్పయాగం, పవళింపు సేవ జరుగుతాయన్నారు. స్థానిక దేవాలయంవీధిలోని ఉన్న వేణుగోపాలస్వామి ఆలయంలోను ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆలయ ఈఓ ఆర్.రాజేశ్వరరావు తెలిపారు. స్థానిక అచ్యుతాపురం రైల్వేగేటు సమీపంలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని కృష్ణాలయంతో పాటు నగరంలోని పలు కృష్ణుడు ఆలయాల్లో అష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.